సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలిసిన కొండారెడ్డి



మహారాణిపేట : మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో ఆ పార్టీ విశాఖ జిల్లా స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడు కొండారెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో సత్కరించారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు



టిఫిన్ సెంటర్ నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

మద్దిలపాలెం: పాలిథిన్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు చిరు వ్యాపారులను హెచ్చరించారు. జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.హరేంధిరప్రసాద్ ఆదేశాల మేరకు సీఎంహెచ్ నరేష్, జెడ్సీ శివప్రసాద్ సూచనలతో 16వ వార్డులో దుకాణదారులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై బుధవారం అవగాహన కల్పించారు. హెచ్‌బీ కాలనీ నుంచి కృష్ణా కళాశాల వరకు ఉన్న టిఫిన్ సెంటర్లు, దుకాణదారులకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్, శుభ్రం సూపర్‌వైజర్, సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించడంతో పాటు ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న వారికి జరిమానా కూడా విధించారు. జీవీఎంసీ అనుమతించిన కవర్లను మాత్రమే వాడాలని సూచించారు.

రోడ్డుపై వ్యర్థాల కుప్ప



ఈస్ట్‌పాయింట్ కాలనీలో పేరుకుపోయిన వ్యర్థాల కుప్ప

ఏయూక్యాంపస్: గెడ్డలో పేరుకున్న వ్యర్థాలను యంత్రంతో తొలగించారు. ఆ వ్యర్థాలను అక్కడే వదిలేయడంతో ఆ రహదారిలో వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఈస్ట్‌పాయింట్ కాలనీలోని స్టేట్ బ్యాంక్ పక్కనే ఉన్న గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలను యంత్రంతో తొలగించారు. వీటిని పక్కనే రోడ్డుపైన కుప్పగా పోశారు. రెండు రోజులుగా వీటిని తొలగించకపోవడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఆ ప్రాంతంలో నివాసితులు ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ సిబ్బంది సత్వరం స్పందించి, తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

దోమల నియంత్రణకు పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న జోన్-3 సహాయ వైద్యాధికారి ప్రసాదరావు

సీతంపేట: మలేరియా, డెంగ్యూ జ్వరాలను వ్యాప్తి చేసే దోమల నియంత్రణకు యాంటీ లార్వా ఆపరేషన్లు సమర్థవంతంగా నిర్వహించాలని జోన్ 3 సహాయ వైద్యాధికారి బి.ప్రసాదరావు అన్నారు. గురువారం మలేరియా, డెంగ్యూ జ్వరాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ జ్వరాల నియంత్రణకు స్ప్రేయింగ్, ఫాగింగ్ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. దోమలు పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా జ్వరాలు నమోదు కాకుండా ముందస్తు నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఎస్‌ఏ బంధం శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు శివ, రాంబాబు, నాయుడు పాల్గొన్నారు.

జెన్ వనం.. కళావిహీనం



ఏడాది కిందట ఆకర్షణీయమైన కొలను



ప్రస్తుతం అధ్వానంగా ఇలా..

ఏడాదిలోనే పార్కు నిర్వీర్యం

అడుగడుగునా నిర్వహణ లోపం

బుద్ధుడి విగ్రహం చెంతనే అసాంఘిక కార్యకలాపాలు

పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

నాడు

నగరం మధ్యలో ఓ చిట్టడవి.. అందులో జలపాతాన్ని తలపించేలా చిన్న చిన్న ప్రవాహాలు.. వాటి మధ్య బుద్ధుడి విగ్రహం.. చుట్టూ కుందేళ్లు, జింకలు, ఏనుగుల సమూహం.. ఇదంతా ఏడాది క్రితం జీవీఎంసీ నిర్మించిన జెన్ పార్క్‌లో అద్భుత దృశ్యాలు.

నేడు

జలపాతం మాయమైంది. వాటర్ ఫౌంటైన్‌లో నీరు లేక, చెత్త చేరి అధ్వానంగా దర్శనమిస్తోంది. జింకలు, కుందేళ్లు, ఏనుగుల బొమ్మలు శిథిలం అయ్యాయి. జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యంతో ఏడాదిలోనే పార్కు కళావిహీనంగా మారింది.

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ **వార్డులోని సంపత్** వినాయక ఆలయం రోడ్డులో **జీవీఎంసీ కమిషనర్** బంగ్లాను ఆనుకుని ఉన్న **ఈ పార్క్‌ను గత** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో **జీవీఎంసీ అధికారులు** ఎంతో సుందరంగా తీర్చిద్దారు. **ఆ పార్కు**లోకి వెళ్తే ఒక చిట్టడవిలోకి **వెళ్లిన అనుభూతి** వచ్చేది. కానీ ఇప్పుడు ఆ **పార్కులోకి వెళ్తే** ఏదో తెలియని అసంతృప్తితో సం**దర్శకులు వెనుదిరు**గుతున్నారు.

కమిషనర్ లేకపోవడంతో..

జీవీఎంసీకి పూర్తి స్థాయి కమిషనర్ లేకపోవడంతో కమిషనర్ బంగ్లా ఖాళీగా ఉంటోంది. దీంతో జీవీఎంసీ అధికారులెవరూ ఆ ప్రాంతాన్ని పట్టించుకోవడం లేదు.

జీవీఎంసీ కమిషనర్ బంగ్లాను ఆనుకుని ఉన్న.. **జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి నడక దూరంలో ఉన్న పార్కునే అధికారులు గాలికి వదిలేశారంటే.. నగరంలో ఇక మిగిలిన పార్కుల సంగ**తేంటని పలువురు విమర్శిస్తున్నారు. ఎంతో ప్రత్యేకతను సంతరించుకున్న, ప్రశాంతతకు నెలవైన ఈ పార్కుపై జీవీఎంసీ అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించాలని సందర్శకులు కోరుతున్నారు.

శిథిలమైన జంతువుల ఆకృతులు

సందర్శకులకు చిట్టడవి అనుభూతిని కలిగించాలనే ఉద్దేశంతో పార్కులో కుందేళ్లు, జింకలు, ఏనుగుల వంటి జంతువుల ఆకృతులను ఏర్పాటు చేశారు. అయితే వాటిలో చాలావరకు శిథిలమైపోతున్నాయి. జింకల కొమ్ములు విరిగిపోయాయి. ఏనుగు, కుందేళ్ల ఆకృతులు కనుమరుగయ్యాయి.



కొమ్ములు విరిగిపోయిన జింకల బొమ్మలు

ఎండి పోయిన నీటి కొలనులు



బుద్ధుడి విగ్రహానికి ఇరువైపులా చిన్న ప్రవాహాలు (నాడు)



నీటి ప్రవాహం లేక ఇప్పుడిలా.. (నేడు)

ఈ పార్కుకు ప్రధాన ఆకర్షణ చిన్న చిన్న ప్రవాహా**లతో ఉన్న నీటి కొలను**లు. నిర్వహణ లోపంతో ఆ **నీటికొలనులో నీరు** ఎండిపోయింది. పార్క్ **ముఖద్వారం వద్ద** ఉన్న ఈ కొలనులు ఎండిపోవడంతో కళను కోల్పోయింది. ఎంతో ఆసక్తితో వెళ్తున్న సందర్శకులకు ప్రవేశ ద్వారం వద్దనే నిరాశ కలుగుతోంది. బుద్ధుడి విగ్రహానికి ఇరువైపులా ఉన్న చిన్న ప్రవాహాల పరిస్థితి ఇంతే.

తథాగతుడి చెంత అసాంఘిక కార్యకలాపాలు

పార్కు నిర్వహణను జీవీఎంసీ అధికారులు పూర్తిగా పట్టించుకోకపోవడంతో పార్కులో విద్యుత్ దీపాలు సైతం పని చేయడం లేదు. దీంతో తథాగతుడు కొలువుదీరిన జెన్ పార్కు అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారింది. నగరంలో ప్రత్యేకతను సంతరించుకునేలా రూపొందించిన ఈ పార్కులో ఎక్కడ చూసినా మద్యం సీసాలే కనిపిస్తున్నాయి. దీంతో సందర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పార్కులో బుద్ధుడి విగ్రహం సమీపంలో మద్యం సీసాలు

అపారిశుధ్యంపై జెడ్సీ ఆగ్రహం

కేటరింగ్ నిర్వాహకులకు రూ.5 వేలు జరిమానా

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో జోన్-2 జెడ్సీ కనకమహలక్ష్మి గురువారం సందర్శించారు. వార్డు పరిధి లీలాసుందరినగర్, రాజీవ్‌నగర్, శ్రీకాంత్‌నగర్‌ను ఆనుకొని కనకమహలక్ష్మి కేటరింగ్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. రోడ్లు, కాలువలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. రోడ్డు పక్కన చెత్త నిల్వలు ఉండడం, కాలువల్లో చెత్త పేరుకుపోవడం, కనకమహలక్ష్మి కేటరింగ్ పరిసరాలలో రోడ్లు పాడవడం, చెత్తతో రోడ్డు అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన జెడ్సీ పారిశుధ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అక్కడ చెత్త నిల్వలను పారిశుధ్య సిబ్బందిచే తొలగించారు. కేటరింగ్ నిర్వాహకులకు రూ.5,000 జరిమానా విధించారు.



శ్రీకాంత్‌నగర్ రోడ్డులో నిల్వ ఉన్న చెత్త పరిశీలిస్తున్న జెడ్సీ కనకమహలక్ష్మి

పరిసరాలు శుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. ఇలాంటి పరిస్థితి పునరావృతమైతే చర్యలు తప్పవని కేటరింగ్ నిర్వాహకులకు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయం సిబ్బందిని ఆమె హెచ్చరించారు. ఈ పర్యటనలో జోన్-2 ఏహెచ్‌ఎంవో డాక్టర్ కిశోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ: ఆరిలోవ 33/11 కేవీలో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ(ఆపరేషన్) పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఆరిలోవ నీడర్‌తో పాటు హనుమంతవాక, పైనాపిల్‌కాలనీ ఫీడర్లలో మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధి సంతపాలెం, రవీంద్రనగర్, తోటగరువు, గాంధీనగర్, అన్నానగర్, బాలాజీనగర్, శ్రీహరినగర్, కైలాషనగర్, ముస్తఫాకాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు.

పెదవాల్తేరు రైతుబజారుకు మరమ్మతులు



రైతుబజారు వద్ద చేపట్టిన కాల్వ పనులు

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరు రైతు బజారులో రూ.3 లక్షలతో అధికారులు మరమ్మతులు చేపట్టారు. బజారు చుట్టూ కాలువ, గోడలు మరమ్మతులు చేస్తున్నారు. దీనికి సంబంధించిన పనులను గురువారం ప్రారంభించారు. రైతుబజారుకు దుర్గంధం నుంచి విముక్తి కలగనుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆదమరిస్తే అంతే...!

ఏయూక్యాంపస్ : కిర్లంపూడి లే అవుట్ ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై ప్రయాణించేవారు ఆచితూచి అడుగేయాలి. ఫుట్‌పాత్‌ల నిర్మాణంలో నాణ్యతా లోపం కారణంగా అంబికా సీ గ్రీన్ హోటల్ దాటగానే పెద్ద గుంత ఏర్పడింది. రాత్రి వేళల్లో ఈ మార్గంలో వీధిదీపాలు సైతం అంతంతమాత్రంగానే వెలుగుతున్నాయి. ప్రయాణికులు ఆదమరచి అడుగేస్తే ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్లే. జీవీఎంసీ అధికారులు స్పందించి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.



కిర్లంపూడి లే అవుట్‌లో ఫుట్‌పాత్‌పై భారీ గుంత

కొనసా..గుతున్న పనులు

పర్యాటకులు, నగరవాసుల అవస్థలు

ఏయూక్యాంపస్: సాగరతీరంలో మరమ్మతు పనులు కొనసా..గుతున్నాయి. పర్యాటకులు, నగరవాసులకు పరీక్ష పెడుతున్నారా అన్న చందంగా ఇవి జరుగుతున్నాయి. బీచ్‌రోడ్డులో ఫుట్‌పాత్‌లపై మరమ్మతులు, కూలిన రక్షణ గోడ నిర్మాణం వంటి పనులు జరుగుతున్నాయి. ఇవి దీర్ఘకాలంగా కొనసాగుతూ నగరవాసులకు నిత్య పరీక్షగా మారుతున్నాయి. నిత్యం వేలాది మంది సందర్శకులు వచ్చే సాగర తీరంలో పనులు త్వరితగతిన జరగాల్సిన అవసరం ఉంది. దీనికి భిన్నంగా ఇక్కడ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. పైగా నిర్మాణానికి వినియోగించే వస్తువులు, ఇసుక, పిక్క వంటివి ఫుట్‌పాత్‌పై వేశారు. పనులు నెమ్మదిగా సాగడంతో వాకింగ్‌కు వచ్చేవారికి ఇబ్బందిగా మారాయి.

- పాండురంగాపురం నుంచి వైఎంసీఏ వరకు రహదారిపై ఫుట్‌పాత్ పలు ప్రాంతాల్లో దెబ్బతింది. వీటిలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే మరమ్మతులు చేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో మరమ్మతులు అవసరమైనా అధికారులు వాటిపై ఇంకా దృష్టి సారించిన దాఖలాలు లేవు.
- రోడ్డుపై ఒకచోట భారీ గుంత ఏర్పడింది. దీని చుట్టూ చిన్నపాటి కర్రలు నాలుగు పాతి, వదిలేశారు.



రోడ్డుపై పడిన గుంత

ప్రముఖులు పర్యటించే బీచ్‌రోడ్డులో ఇటువంటి గుంతలు ఏర్పడటం, వాటికి వెంటనే మరమ్మతులు చేయకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

ప్రస్తుతం జరుగుతున్న పనుల నాణ్యత కూడా అంతంత మాత్రంగానే ఉంటోంది. సిమెంట్ నిర్మాణాలను నిత్యం నీటితో తడపడం ఎంతో అవసరం. అయితే వీటిని తడపడం తూతూ మంత్రంగా జరుగుతోంది. ఇదే విధంగా పనులు సాగితే కొద్దిరోజుల్లోనే పునర్నిర్మాణం చేయాల్సిన పరిస్థితులు ఎదురవుతాయి.

ప్రధాని వస్తే..

వచ్చేనెలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖలో నిర్వహించాలనే ప్రతిపాదన ఉంది. దీనికి స్వయంగా ప్రధానమంత్రి హాజరయ్యే అవకాశం ఉంది. దీనిని నిర్వహించడానికి అనువైన వేదికల్లో ఒకటిగా బీచ్‌రోడ్డును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. అప్పటికి సాగర తీరాన్ని పూర్తిస్థాయిలో తీర్చిదిద్దడం, సిద్ధం చేయడం ఎంతో అవసరం. అధికారులు త్వరితగతిన పనులు చేపట్టి, ఫుట్‌పాత్‌లు, పేవ్‌మెంట్ల మరమ్మతులు పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.



ఫుట్‌పాత్‌పై జరుగుతున్న మరమ్మతులు



కొనసాగుతున్న ఫుట్‌పాత్, గోడ నిర్మాణ పనులు

బాబోయ్.. కుక్కలు

ఆరిలోవ: ముడసర్లోవ ప్రాంతంలో కుక్కలు భయపెడుతున్నాయి. గుంపులుగా చేరి వాకర్స్‌కు ఆటంకంగా మారుతున్నాయి. ముడసర్లోవ ప్రాంతం ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వెళ్లేవారితో సందడిగా ఉంటుంది. బీఆర్టీఎస్ రోడ్డుతో పాటు ముడసర్లోవ రిజర్వాయరు వెనుక రోడ్లలో వాకర్స్ సందడి ఎక్కువ. ఆయా ప్రాంతాల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ గుంపులుగా చేరడంతో అటుగా వెళ్లేందుకు వాకర్స్ భయపడుతున్నారు. అవి దాడి చేయడంతో పలువురు వాకర్లు ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

శస్త్రచికిత్స అనంతరం వదిలేయడంతో..

దీన్‌దయాల్‌పురం వద్ద జీవీఎంసీ కుక్కల ఫ్యామిలీ ప్లానింగ్ సెంటర్‌లో శస్త్ర చికిత్సలు జరిపిన అనంతరం సిబ్బంది వాటిని ముడసర్లోవ రోడ్లలో విడిచిపెట్టేస్తున్నారు. నిజానికి ఏ ప్రాంతంలో కుక్కలను పట్టుకొంటే వాటికి శస్త్ర చికిత్సలు జరిగిన తర్వాత తిరిగి అదే ప్రాంతంలో విడిచిపెట్టాలి. కానీ అలా జరగడంలేదు. దగ్గరగా ఉండటంతో ఇదే ప్రాంతంలో విడిచిపెట్టడంతో కుక్కల సంఖ్య ఈ ప్రాంతంలో పెరిగిపోతుందని స్థానికులు, వాకర్లు అంటున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ముడసర్లోవ రిజర్వాయరు వెనుక రోడ్డులో కుక్కల గుంపు

గడువు పొడిగిస్తారా?

- గడువు ముగియకుండానే వెబ్‌సైట్ బంద్
- జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారుల మాయాజాలం
- కూటమి సర్కారుపై లబ్ధిదారుల ఆగ్రహం

ఎంవీపీకాలనీ: షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) కార్పొరేషన్ ద్వారా అందించే ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకునే ప్రక్రియలో లబ్ధిదారులకు తీవ్ర నిరాశ ఎదురైంది. దరఖాస్తు గడువు 10వ తేదీ అని ముందుగా ప్రకటించగా.. అధికారిక వెబ్‌సైట్ 8వ తేదీ నుంచే పనిచేయడం మానేసింది. దీంతో అర్హులైన అనేకమంది దరఖాస్తు చేసుకోలేకపోయారు. ఈ సమస్యపై జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెబ్‌సైట్‌ను తక్షణమే పునరుద్ధరించి.. దరఖాస్తు గడువును పొడిగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

వందలాది మందికి నష్టం

సబ్సిడీ రుణాల కోసం ఆశగా ఎదురుచూస్తున్న వందలాది మంది లబ్ధిదారులకు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ చర్యలు తీవ్ర నిరాశకు గురిచేశాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.16.88 కోట్ల బడ్జెట్‌తో 32 రకాల రుణాలను అందించాలని కార్పొరేషన్ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వం విశాఖ జిల్లాకు ఈ ఏడాది 406 యూనిట్లు కేటాయించింది. 21 నుంచి 50 సంవత్సరాల వయసు గల అర్హులైన అభ్యర్థులు https:// apobmms. apcfss. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అయితే, దరఖాస్తు గడువు ముగియడానికి రెండు రోజులు ఉండగా.. 8వ తేదీ నుంచే వెబ్‌సైట్ పనిచేయడం మానేసింది. చివరి రెండు రోజుల్లో దరఖాస్తు చేసుకుందామనుకున్న వారికి తీవ్ర నిరాశ ఎదురైంది. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు వంటి అవసరమైన అన్ని పత్రాలతో సిద్ధంగా ఉన్నప్పటికీ.. సాంకేతిక సమస్యల కారణంగా వారు దరఖాస్తు చేసుకోలేకపోయారు. ముఖ్యంగా ట్రాన్స్‌పోర్ట్ వాహనాల రుణాల కోసం డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్నవారు సైతం ఈ అవకాశాన్ని కోల్పోయారు. ఈ విషయంపై వివరణ కోరేందుకు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) సత్యపద్మను సంప్రదించడానికి ప్రయత్నించగా.. ఆమె అందుబాటులోకి రాలేదని లబ్ధిదారులు తెలిపారు.



ఎస్సీ రుణాల కోసం రూపొందించిన ప్రభుత్వ వెబ్‌సైట్

ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమా?

ఎస్సీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తు గడువు పెంపుపై ఇప్పటికీ ఎలాంటి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. వెబ్‌సైట్ సమస్య కారణంగా దరఖాస్తు చేసుకోలేకపోయిన వారికి గడువు పొడిగిస్తామని కార్పొరేషన్ సిబ్బంది హామీ ఇచ్చినప్పటికీ.. ఐదు రోజులు గడిచినా అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు వెలువడలేదు. కీలకమైన చివరి రెండు రోజుల్లో వెబ్‌సైట్ నిలిచిపోవడం పట్ల లబ్ధిదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది కూటమి ప్రభుత్వ ఉద్దేశపూర్వక చర్యేనని, కావాలనే ఆన్‌లైన్ ప్రక్రియను నిలిపివేశారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. తక్షణమే దరఖాస్తు గడువును పొడిగించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన కోసం అర్హులైన లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

నిరాశే మిగిలింది

ఎస్సీ కార్పొరేషన్ రుణం కోసం ఎదురుచూసిన మాలాంటి వారికి నిరాశే ఎదురైంది. రుణాలు మంజూరు చేస్తారని ప్రకటించడంతో కొత్త కుల ధ్రువీకరణ పత్రం కూడా సిద్ధం చేసుకున్నాం. అయితే దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నించగా 8వ తేదీ నుంచి వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో అర్హత ఉన్నా దరఖాస్తు చేసుకోలేకపోయాం. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– శ్రీకాంత్, చినవాల్తేరు

సెక్టార్-10లో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-10లోని బీటీ రోడ్డు నిర్మాణానికి జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు గురువారం శంకుస్థాపన చేశారు. 18వ వార్డ్ కార్పొరేటర్ గొలగాని మంగవేణి కొబ్బరికాయ కొట్టి, పూజలు చేశారు. రూ.20 లక్షలతో సెక్టార్-10లో అప్పుఘర్ రోడ్, ఎంవీపీ డబుల్ రోడ్లను కలుపుతూ ఈ నిర్మాణం జరగనుంది. దీంతో పాటు భాష్యం స్కూల్ జంక్షన్ నుంచి ఎస్టీ బాలికల కళాశాల హాస్టల్ మీదగా ఎంవీపీ సర్కిల్ రోడ్డును కలిపే మార్గం కూడా నిర్మించనున్నారు. ఎస్టీ బాలికల కళాశాల హాస్టల్ రోడ్డు దారుణంగా ఉండటంతో వర్షం కురిసిన ప్రతిసారీ విద్యార్థులు, స్థానికులు ఈ రోడ్డులో ప్రయాణం చేసేందుకు ఇబ్బంది పడుతున్నారు. అయితే ఆ రోడ్డులో నిర్మిస్తున్న ఓ బహుళ అంతస్తు భవనం కారణంగా కొంతకాలంగా రోడ్డు నిర్మాణాన్ని నిలిపివేసిన ఇంజినీరింగ్ విభాగం అధికారులు ప్రస్తుతం రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక టీడీపీ నాయకుడు పోలారావు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.